నీరివ్వని ఎత్తిపోతలు..!

- ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకం
- మండల రైతుల ఇక్కట్లు
- పథకాలను పునరుద్ధరించాలని వినతి



నిరుపయోగంగా ఉన్న మత్కేపల్లి ఎత్తిపోతల పథకం

చింతకాని: మెట్టభూములకు సాగు నీరందించే లక్ష్యంతో గత ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని మత్కేపల్లి, తిమ్మినేనిపాలెం, సీతంపేట, జగన్నాథపురం, చింతకాని, లచ్చగూడెం, బొప్పారం గ్రామాల్లో నిర్మించిన ఎత్తిపోతల పథకాల్లో కేవలం జగన్నాథపురం గ్రామంలోని ఎత్తిపోతల పథకం మాత్రమే పనిచేస్తుంది.

నీరందక ఎండుతున్న పొలాలు..

మత్కేపల్లి గ్రామంలో స్వర్ణజయంతి గ్రామస్వరాజ్ గార్ యోజన పథకం కింద రూ.27.64 లక్షల వ్యయంతో 194 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు మున్నేరుపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. సుమారు 17 ఏళ్ల క్రితం మున్నేరుకు వచ్చిన వరదలకు పథకానికి సంబంధించిన రెండు 30 హెచ్‌పీ విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, మీటర్లు పూర్తిగా పాడైపోగా ఆయకట్టు కింది ఉన్న 194 ఎకరాల్లో సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీతంపేట ఎత్తిపోతల పథకం గత 18 ఏళ్లుగా పనిచేయటం లేదు. ఫలితంగా 132 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందటంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎత్తిపోతల పథకాల మరమ్మతుల కోసం నీటిపారుదల కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందించాలి..



ఎత్తిపోతల పథకం కింద సాగు చేస్తున్న పంటలకు నీరు అందించాలి. నీటి సౌకర్యం లేక ప్రతీ ఏడాది పంటలు ఎండిపోతున్నాయి. పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నప్పటికి నీళ్ల లేక పంట దిగుబడి రావటం లేదు. ప్రభుత్వం సాగునీటి పథకాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నప్పటికీ ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకోవటం లేదు.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, రైతు, మత్కేపల్లి

మరమ్మతులు చేపట్టాలి..



అధికారులు పట్టించుకోకపోవటంతో పథకాలు నిరుపయోగంగా మారాయి. స్పందించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరణ చేయాలి. ఆయకట్టు కింద సాగుచేసిన పంటపొలాలను నీరందించాలి. సాగునీటి విషయంలో రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. పంటలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది.

– చిర్ర నారాయణ, రైతు, మత్కేపల్లి

కాలిపోయిన మోటార్లు..



బొప్పారం గ్రామంలో ఎత్తిపోతల పథకం మోటార్లు, స్టార్టర్లు కాలిపోవటమే కాకుండా షెడ్ పూర్తిగా ధ్వంసమై పూర్తిగా నిరుపయోగంగా మారింది. దీంతో వందల ఎకరాల్లోని పంటపొలాలు బీడు భూములుగా మారాయి. అదేవిధంగా లచ్చగూడెం ఎత్తిపోతల పథకంలో విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కాలిపోయాయి. దీనికి తోడు పైపులైన్ కూడా పూర్తిగా ధ్వంసమవ్వడంతో 16 ఏళ్ల నుంచి పనిచేయటం లేదు. ఆయకట్టు కింద ఉన్న పంటపొలాలకు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు

కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే మద్దతు ధర

- ఎమ్మెల్యే రాగమయి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: ప్రభుత్వం ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను అమ్మి రైతులందరూ మద్దతుధర పొందాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని అంజనాపురం, తల్లాడ, రామానుజవరం, పినపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సన్న రకం వరి ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ఏ గ్రేడ్ సన్న రకం వరికి క్వింటాకు రూ.2,320, కామన్ గ్రేడ్(దొడ్డు రకం) వడ్లకు రూ.2,300 చెల్లించనున్నట్లు వివరించారు.. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వనజ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ కె.శ్రీదేవి, సొసైటీ అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, ఏఓ ఎండి.తాజుద్దీన్, నాయకులు కాపా సుధాకర్, దగ్గుల రఘుపతిరెడ్డి, రాయల రాము, తుమ్మలపల్లి రమేష్, అడపా అనిల్, కొమ్మినేని ప్రభాకర్‌రావు, దగ్గుల రాజశేఖర్ రెడ్డి, కటికి నరసింహారావు, అయినాల రామలింగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు బ్లాకుల వారీగా మ్యాప్‌లు


మ్యాప్‌లు సిద్ధం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సత్తుపల్లిటౌన్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు సత్తుపల్లి మున్సిపాలిటీలో బ్లాకుల వారీగా మ్యాప్‌లను సిద్ధం చేసే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో కమిషనర్ మందా రవిబాబు సమావేశం నిర్వహించారు. మ్యాప్‌లను సంబంధిత బిల్ కలెక్టర్లతో సరి చూసుకోవాలని సూచించారు. సింగరేణి క్వార్టర్స్, కొమ్మేపల్లి కాలనీలను కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోనే సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. దీంతో 90 వరకు ఉన్న బ్లాక్‌లు 96కు పెరిగాయన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ప్రతీ ఇంట్లో వివరాలు చెప్పగలిగేందుకు తప్పనిసరిగా ఒకరు ఉండాలని, డాక్యుమెంట్లు ఏమీ తీసుకోప్పటికీ వాటిని చూసి వివరాలు మాత్రం యజమానులు సిబ్బందికి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది నరేష్, నర్సింహారావు, షాహిన్, శ్రావణి, భాస్కర్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రాంబాబు

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సర్వే వైరా నియోజకవర్గ ప్రత్యేకాధికారి డీఎల్‌పీఓ ఎల్.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతీ రోజూ ఎన్యుమరేటర్లకు దిశా నిర్దేశం చేస్తూ పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేయించాలన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల తదితర వివరాలు సేకరించేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు పెంచడం హర్షణీయం


హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

కొణిజర్ల: రాష్ట్రంలోని అన్ని గురుకులాల విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంపుదలపై మండలంలోని తనికెళ్లలోని అమ్మపాలెం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.జితేష్ షాహిల్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... చార్జీలు పెంచడంతో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహారం అంది సౌకర్యవంతంగా ఉందన్నారు. కళాశాల, పాఠశాల కోఆర్డినేటర్లు కె.కొండలరావు, శ్రీవిద్య, అధ్యాపకులు అనిత, క్రాంతికుమార్, పీడీ మిద్దె రవికుమార్, వార్డెన్ యాకూబ్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నష్టపరిహారం ఇవ్వాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదిగొండ: జాతీయ రహదారి నిర్మాణాల్లో భాగంగా ముదిగొండకు సమీపంలో ఉన్న గుట్టలను పేల్చిన సమయంలో బీటలుబారిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లిస్తామని ఇవ్వలేదని, నష్టపరిహారాన్ని చెల్లించాలని గురువారం తహసీల్దార్ సునిత ఎల్జిబెత్‌కు బాధితులు అఖిల పక్షం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, మంకెన దామోదర్, మందరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన


పనులు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుమారు రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ గోపి శంకుస్థాపన నిర్వహించారు. అధ్యాపకులు, నాయకులు ఎండి.కమల్‌పాషా, గంధ్ర సారథిరెడ్డి, తమ్మిశెట్టి గణేష్, బత్తుల భరత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడికి చేయూత

కొణిజర్ల: ఇటీవల విద్యుత్ స్తంభంపై నుంచి పడి గాయపడ్డ మండలంలోని చిన్నమునగాలకు చెందిన మల్టీపర్పస్ వర్కర్ షేక్ నాగులుమీరాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు గురువారం అందజేశారు. ఎంపీడీఓ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, మల్టీపర్పస్ వర్కర్లు నగదు అందజేసిన వారిలో ఉన్నారు.

సొసైటీలో అందుబాటులో ఎరువులు

కారేపల్లి: కారేపల్లిలోని విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ)లో రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని సొసైటీ చైర్మన్ డి.శ్రీనివాసరావు, కార్యదర్శి బొల్లు హన్మంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డుతో నేరుగా సొసైటీ కార్యాలయానికి వచ్చి కొనుగోలు చేసుకోవచ్చని, మిగతా కాంప్లెక్స్ ఎరువులు రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

పరామర్శ..


నివాళులర్పిస్తున్న సంభాని చంద్రశేఖర్

ముదిగొండ: మండలంలోని వల్లభికి చెందిన కాంగ్రెస్ యువజన మాజీ అధ్యక్షుడు కొండ రామారావు ఇటీవల మరణించగా గురువారం రామారావు చిత్రపటానికి మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా యువజన సంఘం ప్రధాన కార్యదర్శి బిచ్చాల అన్వేష్, బిచ్చాల భిక్షం, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, కుటుంబరావు, అప్పిరెడ్డి, ఏలూరి హనుమంతరావు, వాక వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

'బిజిలీ యోజన'తో రూ.2 లక్షల రుణం

తల్లాడ: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంతో రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఇందులో రూ.75,000 సబ్సిడీగా ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ మేనేజర్ ఎం.ఫణికుమార్ తెలిపారు. తల్లాడలో గురువారం గురజాల నారాయణరావుకు సబ్సిడీపై యోజన పథకంతో మంజూరు చేసిన సోలార్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజిలీ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కారేపల్లి: మండల పరిధిలోని మాధారం గ్రామానికి చెందిన కల్తి లింగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి మాజీ ఎంపీటీసీ భాగం రూపానాగేశ్వరరావు రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. నాగళ్ల సీతయ్య, మూడ్ ఈశ్వరీ, గుర్రం కిట్టు, చాగంటి అభిలాష్, ఎల్లబోయిన కిట్టు, వెంకన్న, పస్తం శంకర్ ఉన్నారు.

సీఎం పుట్టినరోజు సందర్భంగా చిత్రకళా ప్రదర్శన


ప్రదర్శనను ప్రారంభిస్తున్న దయానంద్

సత్తుపల్లిటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో చిత్రకారిణి నిర్మలసాయిశ్రీ ఆధ్వర్యాన గురువారం చిత్రకళ ప్రదర్శన ఏర్పాటుచేశారు. సీఎం 54వ పుట్టినరోజు కావడంతో అంతే సంఖ్యలో ఆయన చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొనగా.. చిత్రకారులైన తండ్రీకుమార్తె బాలకృష్ణ, నిర్మలసాయిశ్రీని సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వేంసూరు: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఐకేపీ ద్వారా అనేక సదుపాయాలు కల్పించడంతో పాటు మహిళా సంఘాల క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చౌడవరం గ్రామంలో గురువారం సాయి గణేష్ గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో పెంచిన సోనాలి ఆశీల్ జాతికి చెందిన పెరటి కోళ్లను ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు చేతుల మీదగా గురువారం పంపిణీ చేశారు. ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు ప్రసాద్, చెన్నారావు, షబ్బీర్, భాస్కర్, వీఓఏ పసుమర్తి సత్యనారాయణ, గుగులోత్ రాధాకృష్ణ, ఆరెంపుల ప్రసాద్, సురేఖ, వహీద, శ్రీఈడ లక్ష్మి, అకౌంటెంట్ అరుణశ్రీ, నాయకులు బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, నాగులు, కనుమతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎండి.ఫైజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయాల్లో అన్నదానాలు


ఎర్రుపాలెంలో..


సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లి సాయి మందిరంలో..

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీ సాయిబాబా ఆలయాల్లో శ్రీ సాయిబాబా వారికి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రీ సాయినాథుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కాకర్లపల్లి శ్రీ సాయినాథుడి మందిరం, రాజీవ్‌నగర్ శ్రీ విజయ సాయి మందిరంలో గురువారం భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్ విజయసాయి మందిరంలో ఆళ్ల మురహరి, కాకర్లపల్లి సాయి మందిరంలో మోరంపూడి శ్రీనివాసరావు, పార్వతి దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు వెల్లటూరి ఉపేంద్రాచారి, మట్టా రాఘవరావు, మోరంపూడి సత్యనారాయణ, వల్లెపు రాంబాబు, కాట్రాల అశోక్, సురేష్, కృష్ణారావు, మందపాటి శారద, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

బండతో.. ముప్పు కొండంత


భారీ బండరాయిని ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

ముదిగొండ: ముదిగొండలోని పారిశ్రామిక ప్రాంతంలో భారీ బండరాళ్లను మోసుకొస్తున్న వాహనాలు ప్రమాదభరితంగా మారాయి. ప్రమాదవశాత్తు ఆ రాయి కిందపడితే అంతే సంగతులు. బండరాళ్లు అదుపుతప్పి రోడ్డుపై పడినా, దొర్లినా ప్రక్కనే ప్రయాణించే వాహనదారులు ప్రాణాలు వదలాల్సిందే. క్వారీల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలించే క్రమంలో కనీస రక్షణ చర్యలు కూడా పాటించడం లేదు. అధిక బరువులతో పలు వాహనాలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రమాదాల జరగకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపిక


విద్యార్థులతో యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బెంగుళూరు చెందిన స్పైడర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, సీఎస్ఆర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ డ్రైవ్‌లో భాగంగా గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా 28 మంది విద్యార్థులను ఎంపికై నట్లు హెచ్ఆర్ మేనేజర్లు ప్రతిభ, ఐశ్వర్య తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ట్రస్టీ చైర్మన్ బండి అన్విద అభినందించారు. అదే విధంగా కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ డీఎస్‌వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవ వేడుకలు


ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గంగారం సాయిస్ఫూర్తి డీఏవీ స్కూల్‌లో గురువారం వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవాగుణం, అంకితభావం, దేశభక్తి, స్కౌట్స్‌అండ్ గైడ్స్ సంస్థతో పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ అధికారి జీఆర్‌కె ప్రసాద్, చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, బండి అన్విద, హెచ్‌ఎం టి.శేషసాయి, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, స్కౌట్స్ మాస్టర్ కె.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

కల్లూరు: మండలంలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. టీడీపీ అడ్‌హాక్ కమిటీ తరపున కనగాల సాంబశివరావు, జాస్తి శ్రీనివాసరావు, కాకర్ల రంగారావు ఈ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రూ. 100 చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ప్రమాద బీమా రూ. 5 లక్షలు, అంత్యక్రియలకు రూ. 10 వేలు అందజేస్తామన్నారు. నాయకులు పోట్రు శ్రీనివాసరావు, కట్టా గోపాలరావు, రాజేశ్వరరావు, గోసు కృష్ణారావు పాల్గొన్నారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీకి సంబంధించి మండలంలోని గ్రామాల్లో ఈనెల 9 నుంచి 12 వరకు గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న తిరుమలాపురం, చిన్నమండవ, సీతంపేట, బొప్పారం, రేపల్లెవాడ, నాగిలిగొండ, 10న కోమట్లగూడెం, తిమ్మినేనిపాలెం, వందనం, పందిళ్లపల్లి, పాతర్లపాడు, జగన్నాథపురం, 11న నాగులవంచ, మత్కేపల్లి, రామకృష్ణాపురం, కొదుమూరు, లచ్చగూడెం, 12న చింతకాని, రాఘవాపురం, నర్సింహాపురం, గాంధీనగర్‌కాలనీ, అనంతసాగర్, బస్వాపురం, నేరడ, ప్రొద్దుటూరు, నాగులవంచ రైల్వేకాలనీ గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 13న మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరంను నిర్వహిస్తామని తెలిపారు.

పశు వైద్యశిబిరం విజయవంతం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కల్లూరురూరల్: మండల పరిధిలోని యజ్ఞనారాయణపురం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గోపాలమిత్ర పశువైద్య శిబిరాన్ని మండల పశువైద్యాధికారి కె.మమత ప్రారంభించారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు సంబంధించి పశువులకు చికిత్స చేసి, దూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ... పాడి రైతులు సకాలంలో ఎదను గుర్తించి సమీప వైద్యశాలల్లో, గోపాలమిత్రులతో కృత్రిమ గర్భాధారణ చేయించాలని, తద్వారా మేలుజాతి పశు సంతతిని పొందవచ్చని సూచించారు. వీఎల్ఓ శ్రీనివాసరావు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తుమ్మల వెంకటేశ్వర్లు, రమేష్, శివకృష్ణ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.